క్లుప్తంగా

వర్షం కోసం రామకోటి మహాయజ్ఞం


రామకోటి మహాయజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం: పట్టణంలోని నూతనంగా నిర్మించిన హరిమందిరంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా గ్రామ పెద్దలు రామకోటి మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం శ్రీరాముడికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం రామకోటి మహాయజ్ఞంను ప్రారంభించారు. ఆదివారం నుంచి రాత్రి పగలు 24 గంటల పాటు ఈ రామకోటి తొమ్మిది రోజుల పాటు నిరంతరాయంగా రామకోటి మహాయజ్ఞం సాగనుంది. కార్యక్రమంలో గాంధీపేట ప్రజలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నడివీధి గంగమ్మ ఆలయంలో చోరీ


దుండగులు చోరీ చేసిన ఆలయం

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలోని బండ్లవంకలో నడివీధి గంగమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. నడివీధిగంగమ్మ గంగ జాతర సోమవారం నిర్వహించాల్సి ఉంది. ఇలాంటి క్రమంలో శనివారం రాత్రి దుండగలు అమ్మవారి ఆలయంలోకి చొరబడి హుండీ ధ్వంసం చేసి అందులోని నగదును దోచుకెళ్లారు. ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్


అరుణ ప్రసాద్

కురబలకోట: మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణ ప్రసాద్‌కు ఒడిశాలోని రూర్కేలా నేషనల్ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి డాక్టరేట్ లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. స్టడీ ఆఫ్ లోకలిసేషన్ ట్రాన్సిషన్ ఇన్ నాన్ హెర్మిటియన్ క్వాసిపిరాడిక్ సిస్టమ్స్‌పై పరిశోధనకు గాను ఇతనికి డాక్టరేట్ లభించినట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక గ్రంథాలు వితరణ


ఆధ్యాత్మిక పుస్తకాలను అందజేస్తున్న పద్మజ

మదనపల్లె సిటీ: స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయానికి ఆదివారం పద్మజ పలు ఆధ్యాత్మిక గ్రంథాలను ఉచితంగా అందజేశారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకుల కోసం అందజేసినట్లు దాత తెలిపారు. ఈ గ్రంథాలను పాఠకులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వసంతకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

145 మందికి ఉచిత వైద్యసేవలు


మారేళ్లలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కేవీపల్లె : మండలంలోని మారేళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 145 మందికి వైద్యసేవలు అందించారు. ఆదివారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస ఛారిటుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ×సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో 37 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 145 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ స్పృజన, డాక్టర్ విద్య, డాక్టర్ జిలాని, డాక్టర్ షమీమ్, వలంటీర్లు రామాంజనేయులు, షబ్బీర్, బాషా, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల రక్షణకు బలమైన చట్టాలు తేవాలి



కోల్‌కత్తాలో జరిగిన లాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృత్తం ఉండాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యుల రక్షణకు బలమైన చట్టాలు తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళా వైద్యులపై దాడులకు పాల్పడిన వారిపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. మహిళా వైద్యుల కోసంప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలి.
- రమేష్‌రెడ్డి, తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి, పీలేరు



వైద్యులకు రక్షణ కల్పించాలి



ప్రజల ఆరోగ్యం కోసం పరితపించే వైద్యులు, సిబ్బందిపై దాడితో సమాజానికి తీవ్ర నష్టం జరుగుతుంది. ఇలాంటి దాడులతో వైద్యులు రాత్రి, పగలు సేవలు అందించేందుకు వెనుకడుగు వేస్తారు. ఫలితంగా నిజమైన రోగులకు కూడా వైద్య సేవలు దూరమవుతాయి. వైద్యులకు రక్షణ కల్పించాలి. డాక్టర్లపై ఎలాంటి దాడులు జరిగినా కఠిన శిక్షలు అమలు చేయాలి. -డాక్టర్ ప్రత్యూష, వైద్యురాలు, నిమ్మనపల్లె

నిందితులను కఠినంగా శిక్షించాలి



దేశవ్యాప్తంగా ఆస్పత్రుల్లో వైద్యుల రక్షణ చర్యలే ప్రశ్నార్థంగా మారాయి. అత్యవసర పరిస్థితుల్లో, ప్రమాద సమయాల్లో వైద్య చికిత్సలు చేసే ప్రాణాలు పోసే వైద్యుల ప్రాణరక్షణే ప్రశ్నార్థకంగా మారింది. కోల్‌కత్తా ఘటన బాధకరం. నిందితులను కఠినంగా శిక్షించాలి.
- డాక్టర్ తేజస్వి, గైనకాలజిస్టు, సిహెచ్‌సి, తంబళ్లపల్లె

టన్నుల్లో నిర్లక్ష్యం..వీధుల్లో ప్రత్యక్షం

- అధ్వానంగా పారిశుధ్యం
- కాలువల్లో కదలని మురుగు
- కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తకుప్పలు

ఆరోగ్యమే మహాభాగ్యం.. పచ్చదనం పరిశుభ్రత..ఇలా చెప్పుకోవడానికే తప్పా.. పట్టణాల్లో కనుచూపు మేరల్లోకూడా శుభ్రత, ఆరోగ్య భద్రతా చర్యలు కనిపించవు. వీధుల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది.. అధికారుల నిర్లక్ష్యం ఏరులై ప్రవహిస్తోంది. ఫలితంగా టన్నుల్లో చెత్తకుప్పలు వీధుల్లో ప్రత్యక్షమవుతున్నాయి.


బుగ్గకాలువ ప్రాంతంలో చెత్తకుప్పలు


చెంబకూరురోడ్డులో అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ


మున్సిపాలిటీలోని కాట్లాటపల్లె రోడ్డు దుస్థితి


తిరుపతిరోడ్డులోని నేతాజీకాలనీలో..


తురకపల్లెలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

మదనపల్లె : మదనపల్లె మున్సిపాలిటీ, మండలంలో పారిశుధ్యం నానాటికీ తీసికట్టుగా మారుతోంది. కాలాలతో సంబంధం లేకుండా ఏ కాలంలోనైనా పట్టణంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. మురుగు కాలువల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో వర్షాకాలంలో పొంగిపార్లి రోడ్డుపై మురుగుపారుతోంది. పారిశుధ్య విభాగం సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితిలో మార్పు రావడం లేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజలకు శాపంగా మారింది.

ముందుకు కదలని మురుగు

మదనపల్లె మున్సిపాలిటీలో 35 వార్డులు, మండలంలో 25 పంచాయతీలు ఉన్నాయి. ప్రతిరోజు రెండింటిలోనూ దాదాపు 65 టన్నుల మేర చెత్త ఉత్పత్తి అవుతోంది. మున్సిపాలిటీలో సుమారు 30 టన్నుల మేర చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. మిగిలిన చెత్త కాలువల్లోకి చేరి మురుగు ముందుకు కదలకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చాలాచోట్ల మురుగురోడ్లపైకి చేరడంతో దోమలకు ఆవాసంగా మారుతోంది. మామూలు కాలాల్లో ఎలా ఉన్నా వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. వ్యాధులు వ్యాప్తి చెందేందుకు మురుగునీరు కారణమవుతోంది. పట్టణం నడిబొడ్డున బాహుదా, బుగ్గకాలువలు వెళుతుండటంతో వీటి పరివాహక ప్రాంత ప్రజలు మురుగునీటిని ఇందులోకి వదులుతుండటంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. దీనికితోడు చికెన్‌షాపుల వ్యర్థాలు, ఇతరాలన్నింటినీ తీసుకువచ్చి ఇందులో పడవేస్తుండటంతో తారకరామ థియేటర్ సమీపం, బెంగళూరు బస్టాండ్ బ్రిడ్జి వద్ద దుర్వాసన వెదజల్లుతూ, ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి ఉంది. అంతేకాకుండా మురుగు నిలిచిన చోట కనీసం దోమలవృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్, కిరోసిన్ చల్లాల్సి ఉన్నా ఆ విధమైన పనులేమీ చేయడం లేదు. మరీ ముఖ్యంగా క్రమం తప్పకుండా మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త తొలగించాల్సి ఉంది. ప్రధానవీధుల్లో మినహా పట్టణం మొత్తం ఆ పనులు చేస్తున్న దాఖలాలు లేవు.

పేరుకుపోతున్న చెత్తకుప్పలు

పట్టణంలోని జనాభాకు, రోజువారీ ఉత్పత్తి అవుతున్న చెత్తను సేకరించేందుకు సరిపడా పారిశుధ్య కార్మికులు లేరు. దీంతో చెత్తసేకరణ, నిర్వహణ కష్టమవుతోంది. కొన్నిప్రాంతాల్లో చెత్త తొలగింపుకు రెండు నుంచి మూడురోజులు పడుతోంది. ప్రధానరహదారుల్లోని కాలువల్లో పూడికలు తీసినప్పటికీ, చిన్న చిన్న కాలువల్లో పూడికలు వర్షం వస్తే తప్ప తొలుగుతున్న దాఖలాలు లేవు.

నమోదవుతున్న డెంగీ, మలేరియా కేసులు..

ఆగస్టు 1 నుంచి 24 వతేదీ వరకు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో 46 డెంగీ, 30 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ పరిస్థితి ఉంటే...ప్రైవేట్ ఆస్పత్రిలో దీనికి రెట్టింపు సంఖ్యలో ఉంది. ప్రభుత్వ ఆస్పత్రిలో డెంగీ పాజిటివ్ కేసుల నిర్ధారణ సమాచారాన్ని బహిర్గతం చేస్తే కలెక్టర్, సంబంధిత అధికారుల నుంచి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గోప్యత పాటిస్తున్నారు.

నేడు పుండీశ్వరస్వామికి మహాకుంభాభిషేకం

రామసముద్రం: మండలంలోని మూగవాడి గ్రామంలో వెలసిన శ్రీ పుండీశ్వరస్వామి మహాకుంభాభిషేకం సోమవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రమేష్‌దీక్షిత్, గ్రామస్తులు తెలిపారు. శ్రావణమాసంలోని సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 8 గంటలకు పంచామృతాభిషేకం, మహాకుంభాభిషేకం, కలశారాధన, హోమాలు , పూర్ణాహుతి, వేద పఠన, నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్రీకృష్ణ జన్మాష్టమికి గోవర్ధనగిరి ఆలయం సిద్ధం



మదనపల్లె సిటీ: శ్రీకృష్ణ జన్మాష్టమికి స్థానిక అమ్మచెరువుమిట్టలోని గోవర్ధనగిరి శ్రీకృష్ణ ఆలయం ముస్తాబు చేశారు. సోమవారం పండుగను పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. రాయలసీమలోని మదనపల్లెలో ప్రత్యేకంగా శ్రీకృష్ణ ఆలయంను నిర్మించారు. ఉదయం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ పరమాత్మునికి అభిషేకాలు, పూజలు, అర్చనలు జరుగుతాయి. 9 గంటలకు స్వామి కళ్యాణం కన్నుల పండువగా జరుగుతుంది. 11.30 గంటలకు చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. సాయంత్రం 3 గంటలకు స్నపనోత్సవం, వసంతోత్సవం జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు శ్రీకృష్ణుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలి

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా
- లాఖ్‌పతి దీదీకి మండలంలో 450 మంది ఎంపిక
- మహిళలకు రూ.5లక్షల వరకు వడ్డీలేని రుణాలు


చెక్కును మహిళాసంఘాలకు అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : మహిళలు ఆర్థిక స్వావలంబన, ఆర్థిక స్వాతంత్ర్యం సాధిస్తేనే కుటుంబమైనా, సమాజమైనా వేగంగా వృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా గ్రూపు మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించేందుకు ప్రకటించిన లాఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని ఆదివారం మండల వెలుగు కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలుచేస్తున్నాయన్నారు. మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ లాఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని అమలుచేస్తోందన్నారు. ఇందులో భాగంగా మదనపల్లె మండలంలో 450 మంది మహిళలకు లబ్ధి చేకూర్చడం జరుగుతోందన్నారు. ఈ పథకం కింద రుణానికి దరఖాస్తు చేసుకున్న మహిళలకు మంజూరైన తర్వాత వ్యాపారంలో ఆర్థిక నిర్వహణ, మార్కెటింగ్, ఆన్‌లైన్ వ్యాపారం, బిజినెస్‌కు సంబంధించిన శిక్షణ అందించి స్వశక్తితో ఎదిగేలా ప్రోత్సహిస్తారన్నారు. వెలుగు ఏపీఎం సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. లాఖ్‌పతి దీదీ 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా అమలు చేస్తామని, లక్షలోపు ఆదాయం ఉన్నటువంటి డ్వాక్రా గ్రూపు మహిళలను ఎంపికచేసి మైక్రో క్రెడిట్ ప్లాన్ కింద స్త్రీనిధి లేదా బ్యాంక్ లింకేజీ, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ తదితర మార్గాల్లో వడ్డీలేని రుణం అందించడం జరుగుతుందన్నారు. సుస్థిర జీవనోపాధి కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం సమావేశంలో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అందించిన అప్రిషియేషన్ సరిఫికేట్లు మహిళలకు అందించారు. 16 గ్రూపులకు సంబంధించి రూ.2కోట్ల80 లక్షలకు బ్యాంకు లింకేజీ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మహిళాసంఘాల లీడర్ సావిత్రి, నాయకులు నాదెళ్లవిద్యాసాగర్, పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా..

రామసముద్రం: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో సమావేశంలో ఏర్పాటు చేసిన మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం లఖ్‌పతి దీదీ పథకం క్రింద 44 డ్వాక్రా గ్రూపులకు రూ.5.42 కోట్లు రుణాలకు సంబంధించి మెగా చెక్కును అందజేశారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె : పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం మదనపల్లి అభివృద్ధి వేదిక నాయకులు హరిశర్మ, కృష్ణమూర్తిలతో కలసి విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ టెరర్ దడపుట్టిస్తోందన్నారు. పెరుగుతున్న జనాభాకు తోడుగా వాహనాల సంఖ్య పెరుగుతోందని అందుకు అనుగుణంగా రోడ్లు విస్తరించక పోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రం అయ్యిందన్నారు. మదనపల్లి మున్సిపాలిటీగా ఏర్పడక ముందు ఉన్న రోడ్లే ఇప్పటికీ ఉన్నాయని, అవి ఆక్రమణలకు గురై పట్టణ ప్రజలకు ఇబ్బందులు ఎక్కువ అవుతున్నాయన్నారు. పెన్షనర్ల ఊటీగా పిలుచుకునే మదనపల్లె పట్టణం నేడు ట్రాఫిక్ సమస్య కారణంగా వారి పాలిట శాపంగా మారుతోందని, బయట తిరగాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకుని ఉండాలని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌కలెక్టర్ చైర్మన్‌గా నియమితులైన ట్రాఫిక్ అడ్వయిజరి కమిటీ సమావేశం జరిగి ఏళ్లు అవుతోందన్నారు. వెంటనే ట్రాఫిక్ అడ్వైజరీ సమావేశం వెంటనే జరపాలని రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సిగ్నల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పెంపు తదితర సమస్యలు పరిష్కారం కోసం కృషి చెయ్యాలని కోరారు. నిత్యం లక్ష మందికి పైగా మదనపల్లె పట్టణంలో ద్విచక్ర, త్రిచక్ర, నాలుగుచక్రాల వాహనాల్లో తిరుగుతున్నారని అన్నారు. పట్టణ ప్రజలకు ట్రాఫిక్ నియంత్రణ పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు. పట్టణ ప్రజలను భాగస్వామ్యం చేయకుండా సమస్య పరిష్కారం కాదన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చెయ్యాలని, ట్రాఫిక్ సిబ్బందిని పెంచాలని కోరారు.

రామసముద్రంలో సమతాసైనికదళ్ ఏర్పాటు



సమతాసైనిక్ దళ్ నూతన కార్యవర్గం

రామసముద్రం: భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో దళిత సమస్యల సాధన కోసం మండలంలో సమతా సైనిక దళ్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమతా సైనిక దళ్ మండల అధ్యక్షుడిగా జయరాజ్, ఉపాధ్యక్షుడిగా బాలాజి, ప్రధాన కార్యదర్శిగా రామంజులు, కోశాధికారిగా మాజీ జెడ్పీటీసీ శివశంకర్‌తో పాటు ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు కృష్ణప్ప, శివ, సోము, శ్రీనివాసులు, నాగరాజ పాల్గొన్నారు.

ప్రజలంతా ఐకమత్యంతో మెలగాలి

- రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి


లోకాయుక్త దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: ఎన్నికల సమయంలో ఎవరి అభిప్రాయం వారిది. ఎన్నికలు ముగిసాకా ప్రజలంతా ఐకమత్యంగా కలసి కట్టుగా ఉండాలి. విభేదాలు వీడి గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ప్రజలకు సూచించారు. ఆదివారం లోకాయుక్త స్వగ్రామమైన మండలంలోని టి సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లి పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ పార్వతీ సమేత సంఘమేశ్వర స్వామి ఆలయ కమ్యూనిటి భవన నిర్మాణం కోసం రూ.10 లక్షలతో చేపడుతున్న పనులకు సంబంధించి ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు లోకాయుక్త దంపతులు భూమి పూజ చేశారు. అనంతరం రెండు మహిళా సంఘాలకు సంబంధించి మంజూరైన రూ.4.50 లక్షల రుణాల చెక్కులను గ్రూపు సభ్యులకు అందజేశారు. అనంతరం లోకాయుక్త దంపతులను పలువురు ఆత్మీయులు ఘనంగా సత్కరించారు. లోకాయుక్త మాట్లాడుతూ ఈ ప్రాంతవాసులు తనపై చూపుతున్న అభిమానం మరువలేనిదన్నారు. ప్రజలంతా సోదర భావంతో భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్ శారద, ఆలయ ధర్మకర్త ఆంజనేయరెడ్డి, వాకర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జక్కల లక్ష్మీహరి, కుడుం శ్రీనివాసులు,ఈవీ రమణ, నాయకులు మనోజ్ జయంత్‌రెడ్డి, బాషా, బయారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలే సురక్షితం


ఎస్‌ఐ నరసింహుడు

పెద్దతిప్పసముద్రం: వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను వినియోగించాలని ఎస్‌ఐ నరసింహుడు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చాలా చోట్ల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నిలబెడుతుండటంతో పర్యావరణానికి విఘాతంగా మారుతోందన్నారు. ధరల విషయంలో మట్టి విగ్రహాలు కూడా చాలా చౌకగా లభిస్తాయన్నారు. కెమికల్స్ ఉపయోగించి తయారు చేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో తాగునీరు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారన్నారు. అంతేగాక మట్టి విగ్రహాల కొనుగోలు ద్వారా చేతి వృత్తుల వారికి కూడా ప్రోత్సహించినట్టు ఉంటుందన్నారు. మండల ప్రజలంతా పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని ఎస్‌ఐ కోరారు.

మాజీ సైనికుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక


కంచర్ల శ్రీనివాసులునాయుడును సన్మానిస్తున్న సభ్యులు

మదనపల్లె : మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడిగా కంచర్ల శ్రీనివాసులునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మాజీ సైనికుల నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. అందులో సంఘం అధ్యక్షులుగా కంచర్ల శ్రీనివాసులు నాయుడు, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటస్వామి, కార్యదర్శిగా సుబ్బారాయుడు, ట్రెజరర్‌గా ప్రతాప్‌రెడ్డి... సంఘ సభ్యులుగా రామ్మూర్తి, సత్యనారాయణ, సహదేవ రెడ్డి, ధవాడి నరేంద్ర, సురేష్‌బాబు, వెంకటరమణరెడ్డి, భీమారెడ్డి, రావణప్ప, ఎం.వి.రమణ, మహమ్మద్‌అలీ, భాగ్యలక్ష్మి, ప్రభావతిలు ఎన్నికయ్యారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం



మాట్లాడుతున్న మానవతా సంస్థ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, పీలేరు: సమవేశమైన మానవతా సభ్యులు

వాల్మీకిపురం: మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేద్దామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక సత్యసాయి సేవా మందిరంలో నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో పాటు యువతలో సేవాభావం పెంపొందే విధంగా అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. మానవతా సంస్థలోకి మరింత మంది విశ్రాంత ఉద్యోగులు, యువత రావాలని, తద్వారా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయవచ్చునన్నారు. ప్రస్తుతం సంస్థ ద్వారా వైకుంఠ రథం, ఫ్రీజర్ బాక్సులు, బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణికులు, ప్రజలు సేదతీరేందుకు బల్లలు ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో ముందుకెళ్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో ఈ సేవలను పల్లెలకు విస్తరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కేశవ రెడ్డి, ఆనంద శెట్టి, రామక్రిష్ణారెడ్డి, శంకర్, చంద్ర, పివి నారాయణ, సత్యనారాయణ, మురళి, రాజారెడ్డి, లక్ష్మన్న, లక్ష్మినారాయణ, శ్రీనివాసులు, సివి రమణ, రమణమూర్తి, రవి, మణి తదితరులు పాల్గొన్నారు.

మానవతా సేవలు విస్తృతం చేస్తాం

పీలేరు : మానవతా సేవలు మరింత విస్తృతం చేస్తామని ఆ సంస్థ చైర్మన్ వి. రామచంద్ర అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో మానవతా సంస్థ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి మానవతా సంస్థలో 325 మంది సభ్యులుగా చేర్చినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదుకు కృషి చేసిన నాయకులకు అభినందనలు చెప్పారు. 1998 నంచి 2020 మధ్య రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులను సన్మానించుటకు కమిటీ తీర్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శెట్టి సుబ్రమణ్యం, నాయకులు అశోక్, రాజేంద్ర, సుధాకర్‌బాబు, అక్రంబాష, జి.వి. రమణ, రామకృష్ణ, వెంకటరమణ, రాచపల్లె కృష్ణమూర్తి, తాతయ్య, రామకృష్ణ, సురేష్‌బాబు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా జ్వరాల నుంచి ప్రజలను కాపాడండి


మాట్లాడుతున్న సాంబశివ

మదనపల్లె : డెంగీ, మలేరియా లాంటి విషజ్వరాల నుంచి ప్రజలను ,పసి పిల్లల ప్రాణాలు కాపాడాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ జిల్లాలో జిల్లాలో డెంగీ, మలేరియా లాంటి విషజ్వరాలు పంజా విసురుతున్నాయన్నారు. హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి జ్వరాల బారిన పడిన ప్రజలను కాపాడడానికి జిల్లాలో ఆరోగ్య శాఖ, మున్సిపల్, పంచాయితీ శాఖ అధికారులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగు పరచడానికి తగు జాగ్రత్తలు, తీసుకోవాలని కోరారు. విషజ్వరాల పేరుతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న రోగులకు రకరకాల పరీక్షలపేరుతో వేలాది రూపాయలు ఖర్చు అవుతున్నదన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వైద్యులు ఇతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రెడ్డప్ప, తిరుమల, ముబారక్, మురళి, రవి పాల్గొన్నారు.